అడుగడుగుకూ గొయ్యి..!



మర్రిచెట్లపాలెం మద్యం దుకాణం దగ్గర పూర్తిగా తారు లేచిపోయి రాళ్లు బయటపడిన రోడ్డు



మర్రిచెట్లపాలెం-అయ్యపరాజుపాలెం మధ్య అడుగడుగునా భారీ గోతులతో నిండిపోయిన రోడ్డు

- అధ్వానంగా మర్రిచెట్లపాలెం – బొద్దికూరపాడు రోడ్డు
- గోతులు పూడుస్తున్నామంటూ కూటమి ప్రచారం
- వాస్తవాలు మాత్రం పూర్తి విరుద్ధం
- ప్రయాణికులకు నిత్యం నరకం

చీమకుర్తి రూరల్: చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం రోడ్లపై గోతులు పూడుస్తున్నామని, సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని కొన్ని నెలలుగా ప్రచారం చేసుకుంది. కానీ, సంక్రాంతి పండుగ పోయి రెండు వారాలు దాటింది. సూపర్-6 హామీలు మాదిరిగానే రోడ్లపై గోతులు పూడ్చే కార్యక్రమం కూడా అటకెక్కింది. ఆర్భాటపు ప్రచారం మినహా ఆచరణ మాత్ర శూన్యంగా ఉంది. చీమకుర్తి మండలంలోని మర్రిచెట్లపాలెం ప్రధాన రహదారి కూడలి నుంచి తాళ్లూరు మండలంలోని బొద్దికూరపాడు వరకు ఉన్న రహదారే అందుకు నిదర్శనంగా ఉంది. ఈ రోడ్డు అడుగడుగునా గోతులమయంగా మారిపోయింది. పూర్తిగా దెబ్బతిన్న ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రజలు నరకం చూస్తున్నారు. చీమకుర్తి మండలంలో నయా పారిశ్రామికవాడగా రూపుదిద్దుకుంటున్న మర్రిచెట్లపాలెం కూడలి నుంచి మర్రిచెట్లపాలెం, అయ్యపరాజుపాలెం, నిప్పట్లపాడు, బక్కిరెడ్డిపాలెం, దేవరపాలెం మీదుగా బొద్దికూరపాడు వరకు గల ఈ ఆర్అండ్‌బీ రహదారిపై ప్రయాణం అంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు అధికంగా ఉండటంతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో చిన్న చిన్న గోతులు కాస్తా భారీ గుంతలుగా మారడంతో ఈ రోడ్డులో రాకపోకలపై వాహనదారులు హడలిపోతున్నారు. సుమారు దశాబ్దంనర క్రితం ఈ రహదారిని అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం దారుణంగా తయారైంది. కొన్ని ప్రాంతాల్లో ఏర్పడిన గుంతల్లో నిత్యం నీరు నిలిచి ఉంటుండటంతో వాహనదారులు రహదారి అంచుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై గుంతలన్నీ పూడ్చివేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచారాలపై దుమ్మెత్తి పోస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి మర్రిచెట్లపాలెం ప్రధాన రహదారి కూడలి నుంచి బొద్దికూరపాడు వరకూ దారుణంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు :



మర్రిచెట్లపాలెం – బొద్దికూరపాడు రోడ్డుపై గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థాలతో రోడ్డుపై దుమ్ము కారణంగా కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోతులన్నీ బూడిదగా మారడంతో వాటిలో పడిన వాహనదారులు ప్రమాదాలతో గాయపడుతున్నారు. తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం చూపించాలి.

చిన్నపరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీటీసీ, నిప్పట్లపాడు

కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితం :



కూటమి ప్రభుత్వం మాటల్లోనే గోతులు పూడుస్తోంది.. చేతల్లో గాలికొదిలేసింది. వాహనదారులు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మర్రిచెట్లపాలెం – బొద్దికూరపాడు రోడ్డుకు మరమ్మతులు పూర్తిచేయాలి.

చీదర్ల శేషు, అయ్యప్పరాజుపాలెం



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

ఖబరస్థాన్ స్థలాన్ని కేటాయించకపోతే ఆందోళన ఉధృతం

- ఇచ్చిన స్థలాన్ని రద్దు చేయటానికి కౌన్సిల్ అజెండాలో పెట్టారు
- ఆవాజ్, సీఐటీయూ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ ముందు ధర్నా

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర ముస్లింల కోసం కేటాయించిన దశరాజుపల్లె రోడ్డులోని ఖబరస్థాన్ స్థలాన్ని వారికి ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆవాజ్ సంస్థ, సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం ప్రధాన గేటు ముందు బుధవారం ధర్నా చేపట్టారు. ప్లకార్డులు, బ్యానర్ పట్టుకొని ఒంగోలు ఎమ్మెల్యే జనార్ధన్‌కు, ఒంగోలు నగర కౌన్సిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చీకటి శ్రీనివాస రావు మాట్లాడుతూ 2021 ఒంగోలు కౌన్సిల్ సమావేశంలో నగరంలోని ముస్లింల ఖబరస్థాన్ కోసం 2 ఎకరాలు కేటాయిస్తూ తీర్మానం చేశారన్నారు. దశరాజుపల్లె రోడ్డులోని సర్వే నంబర్-42, 43ల్లో 2 ఎకరాలు కేటాయిస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ స్థలంలో మౌలిక సదుపాయాలు కల్పించకపోగా ఒంగోలు తహశీల్దార్ ఆ స్థలంలో ఈ స్థలం కోర్టు వివాదాల్లో ఉందని బోర్డు పెట్టారన్నారు. అయితే కోర్టులో వివాదం ఉంటే ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ తీర్మానాల్లో మూడో అంశంగా ఖబరస్థాన్ అంశాన్ని ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. ప్రస్తుతం ఖబరస్థాన్‌కు ఇచ్చిన స్థలం పరిసరాల్లో డొంక పోరంబోకు మరో 44 ఎకరాలు ఉందని, ఆ స్థలాన్ని కాజేయటానికి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు హైకోర్టులో కేసు వేశారని ధ్వజమెత్తారు. ముస్లిం పెద్దలు పోరాడి సాధించుకున్న ఖబరస్థాన్ స్థలాన్ని ముస్లింలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలో 40 వేల మందికి పైగా ముస్లింలు ఉన్నారని, కొత్తపట్నం రైల్వే ఫ్లై ఓవర్ పక్కన తూర్పు క్రిస్టియన్ పాలేనికి ఆనుకొని ఉన్న ఖబరస్థాన్ సరిపోవటం లేదన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల రోడ్డుగా అభివృద్ధి చేయాలని గతంలోనే కౌన్సిల్ తీర్మానం చేసిందని, హైకోర్టు కూడా ఆ స్థలాన్ని ఖబరస్తాన్‌కు కేటాయించాలని తీర్పు కూడా ఇచ్చిందన్నారు. హైకోర్టు ఉత్తర్వులను పాటించాలని, ముస్లింల మనోభావాలను గౌరవించాలని చెప్పారు. ఆవాజ్ జిల్లా కమిటీ నాయకులు మాట్లాడుతూ ఖబరస్థాన్‌కు దశరాజు పల్లె రోడ్డులోని స్థలాన్ని కేటాయించి ముస్లింలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కార్పొరేట్ల అనుకూల బడ్జెట్‌ను వ్యతిరేకించండి



చీమకుర్తి బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘ నాయకులు



నాగులుప్పలపాడులో నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైందని, దానిని వ్యతిరేకించాలని సీపీఎం, రైతు సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయం వద్ద నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి నిధులు కోతపెట్టారని, నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేసేందుకు ప్రభుత్వం వేగంగా ప్రయత్నం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్స్ రద్దు చేయకపోతే రానున్న రోజుల్లో కార్మికులు, ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం, రైతు సంఘాల నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, కే చిన్నపరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా బుధవారం మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ జీఓ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతి బాబు మాట్లాడుతూ కార్మిక, కర్షకులను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. గతంలో ఉపాధి హామీ పథకానికి లక్ష కోట్లు కేటాయించగా, ప్రస్తుతం ఉపాధి కూలీలను దెబ్బతీసే విధంగా ఈ బడ్జెట్లో కేవలం 75 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఆ నిధులను కూడా రోడ్ల నిర్మాణాలకు కేటాయించి ఉపాధి కూలీలకు పనులు లేకుండా చేశారన్నారు. దాంతో పెరిగిన ధరలు ఒకవైపు వెంటాడుతుండగా, ఉపాధి లేక కుటుంబం గడవక కూలీలు తల్లడిల్లిపోతున్నారని ఆవేదన చెందారు. అదేవిధంగా ఎటువంటి నిధులు కేటాయించకుండా వ్యవసాయరంగాన్ని దెబ్బతీసే విధంగా మూడు నల్లచట్టాలను అమలు చేయడానికి కేంద్రం పూనుకుందన్నారు. నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మికులు యూనియన్ పెట్టుకోవడానికి వీల్లేకుండా చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో పాటు నూతనంగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జి.బసవపున్నయ్య, టి.శ్రీకాంత్, కాకాని సుబ్బారావు, యు.వెంకటేశ్వర్లు, రావెళ్ల వెంకట్రావు, అంకమ్మ, మణి, కె.శ్రీను, దాసరి ఆంజనేయులు, మారెళ్ల వెంకట్రావు, చలంచర్ల ఏసు, చిరంజీవి, చీరాల ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూపూడిని కలిసిన చుండూరు



జూపూడి ప్రభాకరరావుతో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: గుండ్లాపల్లిలోని పారిశ్రామికవాడకు వచ్చిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావును ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు రాజకీయ అంశాలపై చర్చించారు. ఆయన వెంట పార్టీ కొండపి నియోజకవర్గ నాయకుడు చింతల వెంకటేశ్వర్లు ఉన్నారు.

పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారంటూ ఫిర్యాదు

మద్దిపాడు: మద్దిపాడులోని సర్వే నంబర్ 49/1లో విలువైన చెట్లకు వేలం నిర్వహించకుండా ధరలు నిర్ధారించి పంచాయతీ ఆదాయానికి పంచాయతీ వారు గండికొడుతున్నారని మద్దిపాడుకు చెందిన మద్దా లక్ష్మీనారాయణ బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఫిర్యాదు చేశారు. లక్షల రూపాయల విలువైన చెట్లకు బహిరంగ వేలం నిర్వహించాలని, పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

9న సాహితీరత్న వెంకటేశ్వర్లు సంస్మరణ సభ

ఒంగోలు మెట్రో: స్థానిక మల్లయ్య లింగం భవనం (సీపీఐ ఆఫీస్) మొదటి అంతస్తులో ఈ నెల 9వ తేదీ ఉదయం పది గంటలకు సాహితీరత్న దివంగత పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలంతా పాల్గొనాలని కోరారు.

టీటీడీ సప్తవాహన సేవల వ్యాఖ్యాతగా పొన్నూరు



వాహన సేవలకు వ్యాఖ్యానం అందిస్తున్న శ్రీనివాసులు

ఒంగోలు మెట్రో: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతిలోని గోవిందరాజ స్వామి దేవస్థానంలో రథసప్తమి సందర్భంగా జరుగుతున్న వాహన సేవల్లో ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు, ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు ఏడు వాహనాల్లో ఐదు వాహన సేవలకు ప్రత్యక్ష వ్యాఖ్యానం చేశారు. హంసవాహన సేవ, హనుమత్ వాహన సేవ, శేషవాహన సేవ, ముత్యపు పందిరి వాహన సేవ, సర్వభూపాల వాహనసేవకు వ్యాఖ్యానాన్ని అందించారు. ఆయా వాహనాలు తిరుమల మాడవీధుల్లో ఊరేగుతున్న సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు వివిధ దేవతామూర్తులుగా అలంకరించుకుని స్వామివారి వాహనం ముందు నడిచారు. కోలాట బృందాలు, నృత్య కళాకారులు, గజనాథులు వారి ముందు నడిచాయి. మేళతాళాలతో మాడవీధి సేవ అత్యంత నయనమనోహరంగా సాగింది. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి వాహన సేవను దర్శించుకున్నారు.

మోక్ష సాధనకు భక్తి వైరాగ్యాలు ఉపకరిస్తాయి



ఆధ్యాత్మిక ప్రవచనంలో అగస్త్యరాజుశివ

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని లలితా జ్ఞానపీఠం 73వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి శ్రీ అగస్త్యరాజుశివచే వర్తమాన సమాజంలో భక్తి, ఆధ్యాత్మిక పెంపుదల ఆవశ్యకత గురించి ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. మోక్ష సాధనకు అవసరమైన భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు ఎలా ఉపకరిస్తాయో వివరించారు. తమ కుటుంబ బాధ్యతల నిర్వహణ కోసం యాంత్రిక జీవనం సాగిస్తూ మానసిక ఒత్తిడులకు లోనవుతూ అనారోగ్యాల బారిన పడుతున్నవారికి ఆధ్యాత్మిక చింతన ఎలా స్వస్థత చేకూరుస్తుందో వివరించారు. అలాగే భగవదనుగ్రహానికి ధార్మికజీవనం, న్యాయ విత్తార్జన, దానగుణం, దయాగుణం, సత్సంగములు ఎలా ఉపకరిస్తాయో భాగవత, భారత పురాణాలలోని ఘట్టాల ద్వారా, భాగవతోత్తముల చరిత్ర అంశాల ద్వారా తెలియచేశారు. అనంతరం పీఠ అధ్యక్షురాలు మాతృశ్రీ విజ్ఞానానంద సరస్వతీమాతాజీ, కమిటీ సభ్యులు అగస్త్యరాజు శివను సత్కరించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున నివాళి



మస్తాన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు, నూర్ బాషాల సంఘ జిల్లా అధ్యక్షుడు గొడుగు మస్తాన్ (68) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. బుధవారం వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున మైనంపాడు వెళ్లి మస్తాన్ మృతదేహానికి నివాళులర్పించారు. మస్తాన్ సేవలను గుర్తుచేసుకున్నారు. సంతనూతలపాడు, చీమకుర్తి జెడ్పీటీసీలు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, మైనంపాడు సర్పంచ్ డి.రమణ, ఉప సర్పంచ్ జి.సుబ్బారావు, ఎంపీటీసీ ఏ రాజకుమారి, సుబ్బారావు దంపతులు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యల్లమందారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ రహంతుల్లా, గ్రామ నాయకులు పెరుగు సుబ్బారావు, మస్తాన్, మాచవరం వెంకట్రావు, షేక్ ఖాసిం నూర్ బాషా సంఘ ప్రతినిధులు, తదితరులు మస్తాన్ మృతదేహానికి సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. గురువారం ఉదయం 10 గంటలకు మైనంపాడు గ్రామంలో మస్తాన్‌కు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు, విద్యా సామగ్రి అందిస్తున్న డాక్టర్ హనుమంతరావు

చీమకుర్తి రూరల్: మండలంలోని పాటిమీదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 70 మందికి అరవింద డయాబెటిస్ ఎండో క్రేన్ క్లినిక్ వైద్య నిపుణుడు డాక్టర్ ఎం.హనుమంతరావు బుధవారం బ్యాగులు, విద్యా సామగ్రి అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు ఆరోగ్య సూత్రాలు, జాగ్రత్తలు వివరించారు. తరచూ వచ్చే సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మంచి చదువులు కొనసాగించాలని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ హనుమంతరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్కే శిలార్, ఉపాధ్యాయులు ఎస్వీ సంజీవి, వాకా కవిత, ఎం.విజయలక్ష్మి, ఆయా ఏపీ గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఏ గ్రేడ్ మోడల్ పంటలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న ఏవో కిషోర్‌బాబు, ప్రకృతి వ్యవసాయ అధికారి రాధా సింగమనేని

ఒంగోలు సిటీ: మండల పరిధిలోని ఉలిచి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అధికారి రాధా సింగమనేని ఆధ్వర్యంలో రాధా ఏ గ్రేడ్ మోడల్ పంటల విధానంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో కిషోర్‌బాబు మాట్లాడుతూ రాధా ఏ గ్రేడ్ మోడల్లో మినుము పంట సాగు చేసిన విధానాన్ని పరిశీలించారు. అలాగే, పసుపు, జిగురు అట్టల వినియోగం, లింగాకర్షక బుట్టల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కషాయాల వాడకం వల్ల పురుగుల సంఖ్య తగ్గించుకోవచ్చన్నారు. అధిక ఖర్చులు తగ్గించుకోవచ్చని, ప్రకృతిని కాపాడుకోవచ్చని అన్నారు. ప్రకృతి పద్ధతుల ద్వారా వ్యయాన్ని నియంత్రించడంతో పాటు పంటల ఉత్పాదకత పెంచుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారి రాధా సింగమనేని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణారెడ్డి, వీఏ బాలకృష్ణ, ఐసీఆర్‌పీలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగాన్ని నివారించాలి



మాట్లాడుతున్న గ్రీస్ వాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్

ఒంగోలు అర్బన్: మత్తు పదార్థాల వినియోగాన్ని నివారించాలని, దాని ద్వారా జరిగే నష్టాలపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గ్రీస్‌వాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో మత్తు విమోచిత భారతదేశం కార్యక్రమంపై సామాజిక రక్షణ జాతీయ సంస్థ, సాధికార మంత్రిత్వ శాఖ, గ్రీస్ వాలీ ఫౌండేషన్ సమన్వయంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ వలంటీర్ జిల్లాలోని 50 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి అలవాట్లు మాన్పించి ఏ విధంగా వారి నైపుణ్యాలు పెంచాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి అర్చన, మానసిక వైద్యులు వివేకానంద, ప్రభుత్వ వైద్య కళాశాల డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రం వైద్యులు, పోలీసు, ఎక్సైజ్, విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ-ఫార్మర్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



మిరప తోటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

చీమకుర్తి రూరల్: మండలంలోని చండ్రపాడు, పల్లమల్లి గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన శాఖాధికారి డి.సంధ్య పాల్గొని నిమ్మ, మిరప తోటలను పరిశీలించారు. కలుపు, ఎండు పుల్ల తీయకపోవడం వలన చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గుతాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి డీవీ భాస్కర్ రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వంరాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ తీసుకొచ్చిందని, భవిష్యత్ అవసరాల మేరకు తప్పనిసరిగా మండలంలోని రైతులందరూ ఈ ఫార్మర్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని 14 అంకెల నంబర్ కలిగి ఉండాలని తెలిపారు. రైతులంతా దగ్గరలోని రైతు సేవా కేంద్రాల వద్ద ఈ-ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థపై తనిఖీలు

ఒంగోలు వన్‌టౌన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఉప కార్మిక కమిషనర్ ఎం.ఎలిజబెతమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 17 నుంచి మార్చి 31వ తేదీ వరకూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌సీపీసీఆర్, పాన్ ఇండియా సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు ట్రంక్ రోడ్డులో తనిఖీలు నిర్వహించి ఇద్దరు బాలకార్మికులను గుర్తించడం జరిగిందన్నారు. బాల కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జిల్లా సీనియర్ మహిళా హాకీ జట్టు ఎంపిక



మహిళా హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

సంతనూతలపాడు: రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా సీనియర్ మహిళా జట్టును బుధవారం సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జిల్లా జట్టులో చోటు కల్పించారు. ఎంపిక ప్రక్రియను అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.సుందరరామిరెడ్డి, టి.రవి కుమార్ పర్యవేక్షించారు. ఎంపిక చేసిన జట్టు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో మైనంపాడు డైట్ ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు, చీమకుర్తి ఎంఈఓ డీవీఎల్ నరసింహారావు, పీడీ ఒ.వనజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి



ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ఎంపీడీవో సురేష్ బాబు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగి పని కావాలని అడిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని అన్ని పంచాయతీలలో ఉపాధి హామీ పనులు ప్రారంభించేందుకు వెంటనే పనులను గుర్తించి ఎస్టిమేట్స్ సిద్ధం చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ఉపాధి హామీ కూలీలకు ప్రతిరోజూ పని కల్పించాలన్నారు. అందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ వాసంతి, ఈసీ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

21 నుంచి ఒకేషనల్ కోర్సుల ప్రాక్టికల్స్


ఒంగోలు సిటీ: ఒకేషనల్ కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలను ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించాలని డీఈఓ కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఒంగోలు డీఆర్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్లో ఒకేషనల్ ప్రాక్టికల్ ఎగ్జామ్స్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన థియరీ పరీక్షలను మార్చి 29వ తేదీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒకేషనల్ కోర్సుల ప్రాక్టికల్ ఎగ్జామ్స్ నామినల్ రోల్స్‌ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ప్రాక్టికల్ ఎగ్జామ్స్ జరిగే తేదీలను విద్యార్థులకు ముందుగా తెలియజేయాలన్నారు. ఒకేషనల్ కోర్సు ఉన్న అన్ని ఉన్నత పాఠశాలలు విద్యార్థులకు ప్రాక్టికల్స్ సెంటర్స్‌గా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏసీ శివకుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పొడిగింపు

ఒంగోలు సిటీ: కల్లుగీత కులాలకు సంబంధించిన మద్యం దుకాణాల దరఖాస్తు గడువును ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లాలో 17, బాపట్ల జిల్లాలో 12 మద్యం షాపులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో ఒంగోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో, బాపట్ల కలెక్టర్ ఆధ్వర్యంలో బాపట్ల పీజీఆర్ఎస్ హాల్లో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిత్యవసరాల ధరలు నియంత్రించాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి డిమాండ్



సంతకాల సేకరణలో ఐద్వా నాయకులు

ఒంగోలు సిటీ: నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించి, ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సత్యనారాయణపురంలో నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు పౌష్టికాహారానికి దూరమవుతున్నారని అన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం అందుబాటులో లేక మహిళలు 57 శాతానికి పైగా రక్తహీనతతో బాధపడుతున్నట్లు చెప్పారు. కుటుంబాలకు వస్తున్న ఆదాయాలకు మించి ఆహారానికి ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవన ప్రమాణాలను పట్టించుకునే స్థితిలో లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, పంచదార మాత్రమే కాకుండా కేరళలో మాదిరి 16 రకాల నిత్యవసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. సురక్షిత తాగునీరు అందించే ప్రయత్నం చేయకుండా రూ.99కు నాణ్యమైన మద్యాన్ని అందిస్తున్నట్లు పాలకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కె.రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వై.అంజనీదేవి, జి.కళ్యాణి, ఎస్.ఇంద్రజ్యోతి, డి.శ్రీదేవి, ఎం.అన్నపూర్ణమ్మ, కె.ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.